ఘనంగా ఎల్లమ్మతల్లి వార్షికోత్సవం

గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ఎల్లమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాషతోపాటు జంట సర్కిళ్ల ఉపకమిషనర్లు మల్లారెడ్డి, నర్సింహ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. – కుత్బుల్లాపూర్, మే 25

నేటి నుంచి శృంగేరి శారదా శంకరమఠం వార్షికోత్సవం

అల్లాపూర్, మే 25:మోతీనగర్ పరిధిలోని శ్రీశృంగేరి జగద్గురు మహాసంస్థానం శ్రీ శృంగేరి శారదా శంకరమఠం 25వ వార్షికోత్సవ ఉత్సావాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక పూజలు ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సీఎస్ఆర్.మూర్తి తెలిపారు. ఆదివారం గురువందనం, గురుపాదుకా పూజ, శ్రీఆది శంకరాచార్యుల అష్టోత్తర శతనామార్చన, గణపతి పూజ కలశస్థాపన,ఋత్విక్ మరణం, ఉదయం 10గంటలకు శ్రీలక్ష్మి గణపతి హోమం తదితర పూజలతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కేపీహెచ్‌బీ కాలనీ, మే 25: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చున్నుపాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శనివారం బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయనగర్‌లోని సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. డాక్టర్‌లు మహ్మద్ ముస్సీ, రజిత, ప్రవీణ్, శ్రీకాంత్, రాకేశ్, సాయి, నేతలు కర్క పెంటయ్య తదితరులు ఉన్నారు.

నిధులు ఫుల్.. అభివృద్ధి పనులు నిల్

- జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వయ లోపం.. ప్రజలకు శాపం
- రోడ్లపై మురుగునీటి ప్రవాహం
- పట్టించుకోని అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగును పరిశీలిస్తున్న జలమండలి జీఎం ప్రభాకర్‌రావు, మేనేజర్ వైష్ణవి

కేపీహెచ్‌బీ కాలనీ, మే 25 : కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్‌లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారుల మధ్య సమన్వ లోపం ప్రజలకు శాపంగా మారింది. బాలాజీనగర్ డివిజన్‌లోని కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ ఎల్ఐజీ 995 నుంచి కన్యకాపరమేశ్వరి టెంపుల్ ముందు నుంచి వెళ్లే.. డ్రైనేజీ పైప్‌లైన్ దెబ్బతిన డంతో గత ఏడాది కాలంగా డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. డ్రైనేజీ పైప్‌లైన్‌లో మురుగునీటి ముందుకు పోకుండా... మళ్లీ డ్రైనేజీ పైప్‌ల ద్వారా మురుగునీరు తిరిగి ఇండ్ల లోకి చేరుతుంది. ఈ సమస్యతో ఇండ్లలో నివసించే ప్రజలు ముక్కులు మూసుకుని జీవించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. డ్రైనేజీ పైప్‌లైన్‌లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులను పలుమార్లు తొలగించినా సమస్య పునరావృతం అవుతూనే ఉన్నది. ఈ సమస్యపై స్థానికులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకోవడంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పునరుద్ధరణకు నిధులు మంజూరయ్యాయి. 65 మీటర్ల దూరం.. 300 ఎంఎం డయా సామర్థ్యం కలిగిన సీవరేజీ పైప్‌లైన్ పనులను చేయడానికి శంకుస్థాపన కూడా జరిగింది. కానీ....నేటికి కూడా ఈ పైప్‌లైన్ పనులు పూర్తి కాకపోవడం.. డ్రైనేజీ మురుగునీరు రోజుల తరబడి రోడ్లపై పరుగులు తీస్తున్నది. శంకుస్థాపన జరిగినా ఇప్పటికీ పనులు పూర్తికాలేదని, జలమండలి అధికారులను అడిగితే.. జీహెచ్‌ఎంసీ నుంచి రోడ్డు కటింగ్ అనుమతులురాలేదని.. వచ్చిన వెంటనే పనులు చేస్తామని చెబుతున్నారు. మరోవైపు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులను అడిగితే... వర్షాకాలం నేపథ్యంలో నిబంధనల ప్రకారం రోడ్డు కటింగ్‌కు అనుమతులు ఇవ్వడం కుదరదని, ఉన్నతాధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామని సమాధానం ఇస్తున్నారు. కానీ.. స్థానిక ప్రజలతో పాటు ఆ రోడ్డు మార్గంలో ప్రయాణించే వాహనదారులు, బాటసారులు మాత్రం ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెండు విభాగాల అధికారుల సమన్వయ లోపం కారణంగా.. ఈ సమస్యను పరిష్కరించడంపై దృష్టి సారించడంలేదని, ఒకరిపై మరొకరు చెబుతూ నిబంధనల పేరుతో జాప్యం చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ సమస్యపై దృష్టి సారించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

ఉన్నతాధికారుల అనుమతి తీసుకుంటాం..

వర్షాకాలం నేపథ్యంలో రోడ్డు కటింట్‌లకు అనుమతులు ఇవ్వకూడదని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. కాలనీ 3వ ఫేజ్‌లో డ్రైనేజీ లైన్ పూర్తిగా దెబ్బతిన్నదని, రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుందని, ఈ పనులను వెంటనే చేపట్టడానికి రోడ్డు కటింగ్‌కు అనుమతి ఇవ్వాలని జలమండలి అధికారులు కోరుతున్నారు. అలాగే పలు ప్రాంతాల్లో పనులు చేయడానికి రోడ్డు కటింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. వారి సూచనలు మేరకు అనుమతులు ఇస్తాం.

– ఆనంద్, డీఈ, మూసాపేట సర్కిల్

డ్రైనేజీ పైప్‌లైన్ వెంటనే మార్చాలి..

కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతినడంతో మురుగునీరు రోడ్డుపై నిర్విరామంగా ప్రవహిస్తుంది. సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. రోడ్డు కటింగ్ అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించి.. డ్రైనేజీ పైప్‌లైన్‌ను మార్చితేనే సమస్య పరిష్కారమవుతుంది. పనులు ఆలస్యమైతే.. రానున్న వర్షాకాలంలో సమస్య తీవ్రమవుతుంది. జీహెచ్‌ఎంసీ అధికారులకు సమస్యను వివరించి అనుమతి తీసుకుంటాం.

– ప్రభాకర్‌రావు, జీఎం, కూకట్‌పల్లి జలమండలి డివిజన్

రోడ్డుకు అడ్డంగా నిర్మాణం.. చర్యలు తీసుకోవాలని వినతి

దుండిగల్, మే 25 : కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్ పరిధి, సూరారం కాలనీలోని సాయిబాబనగర్, కృషి కాలనీలో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి భవన నిర్మాణ పనులు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక కృషి కాలనీ సంక్షేమ సంఘం ఆరోపించింది. ఇక్కడ జరుగుతున్న నిర్మాణానికి మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు సైతం లేవన్నారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప నిర్మాణదారుడిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. సదరు వ్యక్తి భవనం నిర్మించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కాని రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టడం కారణంగానే నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతున్నామన్నారు. ఇక్కడ సదరు నిర్మాణదారుడు గతంలో సెల్లారు తవ్వి, నిర్మాణ పనులు మొదలు పెట్టగా.. అప్పటి అధికారులు కూల్చివేశారన్నారు. కాని కొంత కాలంపాటు ఆగిన ఆయన మళ్లీ రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపట్టడం ఆందోళనకరమన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కుత్బుల్లాపూర్, మే 25 : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ పరిధిలో పలు అక్రమ నిర్మాణాలను టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి ప్రభావతి ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం కూల్చివేశారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లోని వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించడంతోపాటు ఎంతటివారినైనా ఉపేక్షించకుండా అక్రమమని తేలితే సత్వరమే తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నాలాల వద్ద పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలి

నాలాకు రక్షణగా ఏర్పాటు చేసిన కంచెను పరిశీలిస్తున్న జడ్పీ స్నేహ శబరీష్

మియాపూర్, మే 25: వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. అత్యంత ప్రధానంగా నాలాల వద్ద ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాలాలను జడ్పీ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. జడ్పీ మాట్లాడుతూ..జోన్ పరిధిలోని 4సర్కిళ్లలో ఉన్న నాలాలన్నింటికీ మూడువైపులా రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, నాలాలకు సూచికగా బోర్డులను, ఫ్లెక్సీలను విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో వర్షాలు భారీగా పడే అవకాశం ఉన్నందున నాలాలు, మ్యాన్ హోల్స్ వద్ద తగు చర్యలు చేపట్టాలని, నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల సమ్మెతో నాలాల్లో డీసిల్టింగ్ ప్రక్రియ నిలిచిపోవడంతో ఆ పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు విన్నవించారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగం సహా ఇతర విభాగాలు సమన్వయంతో పని చేస్తూ వరద నీటి సమస్యల్లేకుండా చూడాలని, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని జడ్పీ ఆదేశించారు. జడ్పీ వెంట ఈఈ శ్రీనివాస్, ఇతర అధికారులున్నారు.

స్వచ్ఛతపై అవగాహన

శేరిలింగంపల్లి, మే 25 :స్వచ్ఛతపై నిర్లక్ష్యం వద్దని, నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పారిశుధ్య విభాగం అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ ఎన్టీఆర్‌నగర్ కాలనీలో స్థానికులకు ప్రత్యేకంగా అవగాహన నిర్వహించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా పడవేయరాదని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్ సూపర్‌వైజర్ జలంధర్ రెడ్డితోపాటు పలువురు ఎస్ఎఫ్ఏలు, పారిశుధ్య సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి డివిజన్ ఎన్టీఆర్‌నగర్ కాలనీలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పారిశుధ్య విభాగం అధికారులు

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి

కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న శ్రీవీర హనుమాన్ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షుడు మాధవరం కాంతారావు అన్నారు. శనివారం బాలాజీనగర్ డివిజన్‌లో సంజీవని హనుమాన్ దేవాలయంలో సమావేశం నిర్వహించి ఆహ్వానకరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూన్ 1న శ్రీవీర హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని ఏక్తా యాత్రను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ యాత్రలో ప్రజలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ అభియాన్ కమిటీ సభ్యులు, దేవాలయం కమిటీ సభ్యులు, హిందూ సంఘాల నేతలు ఉన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మే 25

పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలు నిరోధించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మే 25: కేపీహెచ్‌బీ కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని, పార్కుల నిర్వహన బాధ్యతలను జీహెచ్ ఎంసీ తీసుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి కోరారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీలోని పలు పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో పార్కుల నిర్వహణ అధ్వాన్నంగా మారిందని, కొన్ని పార్కుల్లో ప్రైవేటు వ్యక్తులు తిష్ఠవేశారన్నారు. పార్కుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రజా అవసరాలకు పార్కులను వినియోగించునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రవీణ్‌కుమార్, రజితగౌడ్, అరవింద్‌రెడ్డి, ఫణీంద్ర, మేకల మైఖల్, నాగమల్లేశ్వర్‌రావు, బాబ్జీ, నితీష్‌కుమార్, కిరణ్, సాయితేజ, అరవింద్ తదితరులు ఉన్నారు.

ఈద్గాల వద్ద వసతులు కల్పిస్తా

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న మసీదు కమిటీ ప్రతినిధులు

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , మే 25 : బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గాల వద్ద తగు మౌలిక వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునేలా పూర్తి తోడ్పాటునందిస్తామన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీ జామా ఏ మసీద్ ఈ నూర్ ఖబరస్తాన్, ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గా వద్ద తగు వసతులను కల్పించాలని ఎమ్మెల్యే గాంధీని కోరారు. శనివారం ఎమ్మెల్యేను ఆయన నివాసం వద్ద కలుసుకుని వినతి పత్రం సమర్పించారు. ఈ పండుగ సందర్భంగా ఈద్గాల వద్దకు పెద్ద సంఖ్యలో ప్రార్థనల నిమిత్తం ముస్లింలు వచ్చే అవకాశం ఉన్నందున వాటి వద్ద అన్ని వసతులను కల్పిస్తామని, అధికారులను అప్రమత్తం చేసి తగు చర్యలు చేపట్టేలా చూస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, సద్యద్ అహ్మద్ ఖాసీం, సలీం, షోయబ్, లుక్మన్, రషీద్, అంజద్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

టయోటా కొత్త మోడల్ కారు ఆవిష్కరణ

అర్బన్ క్రూజర్ సెగ్మెంట్‌లో నూతన మోడల్‌ను టయోటా ఆవిష్కరించింది. టైజర్ పేరుతో వస్తున్న కారును హార్ష టయోటాలో అందుబాటులోకి తీసుకువచ్చారు. 1000 సీసీ అండ్ 1200 సీసీతో వచ్చిన టైజర్‌ను మాదాపూర్‌లోని హర్ష టయోటా షోరూంలో వీపీ సేల్స్ మార్కెటింగ్ ప్రశాంత్ పాములపర్తి మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ వై.బి.స్వామి, సీపీఓ పూర్ణచందర్ రావు, సీఎఫ్ఓ సంజీవ్ కొరిటాల, సీఈఓ ప్రకార్తిక్, కస్టమర్ సర్వీస్ వీపీ నవీన్, జీఎం సేల్స్ సురేశ్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్, మే 25

కార్మికులకు అండగా ఉంటా

బాధిత కార్మికులకు జీతం డబ్బులను అందిస్తున్న కార్మిక సంఘం నాయకుడు రవిసింగ్

కేపీహెచ్‌బీ కాలనీ, మే 25 : పారిశ్రామిక వాడలలో పనిచేసే కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లోని శ్రీ అంజని మ్యాన్ పవర్ లేబర్ కాంట్రాక్టర్ డెవలప్‌మెంట్ ఇండస్ట్రీయల్ గ్లాస్ కంపెనీలో పలువురు కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులకు రావాల్సిన నెలవారీ జీతం డబ్బులను ఇవ్వడంలో కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు పని మానేశారు. చేసిన పనికి జీతం డబ్బులకు ఇప్పించాలని కోరుతూ బాధితులంతా రవిసింగ్‌ను ఆశ్రయించారు. దీంతో శనివారం కంపెనీ యాజమాన్యంతో మాట్లాడిన రవిసింగ్ బాధిత కార్మికులకు రావాల్సిన మూడు నెలల జీతం రూ.2.12లక్షలు ఇప్పించగా.. బాధిత కార్మికులు కార్మిక సంఘం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అనిల్‌కుమార్, సుదర్శన్, జగన్, ప్రేమ్, కిరణ్ తదితరులు ఉన్నారు.

తల్లీకొడుకుల అదృశ్యం

అదృశ్యమైన తల్లీకొడుకులను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

దుండిగల్, మే 25 : ఓ మహిళ తన ఇద్దరు కొడుకులను తీసుకుని ఇంటి నుండి వెళ్లిపోయిన కొన్ని గంటల్లోనే పోలీసులు వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సర్కిల్, సుభాశ్‌నగర్ డివిజన్ పరిధి, సూరారం కాలనీలోని భవానినగర్‌కు చెందిన తేలు మౌనికతో 2014లో తేలు చిరంజీవి అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు దశమంత్, సత్య ఉన్నారు. 2017 చిరంజీవి విద్యుత్‌షాక్‌కు గురై మరణించారు. నాటి నుంచి మౌనిక తన కొడుకులతో కలిసి సోదరుడు తాడేం రమేశ్ ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో మౌనిక శనివారం ఉదయం 10:30 గంటల సమయంలో తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంట్లో చెప్పికుండా బయటకు వెళ్లిపోయింది. ఆందోళనకు గురైన రమేశ్ కుటుంబ సభ్యులు వారి ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతకడంతో పాటు బంధువులు,స్నేహితుల ఇండ్లల్లోనూ ఆరా తీశారు. దీంతో మౌనిక తాము సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేట్రాక్‌పై ఉన్నామని, సోదరుడి వాట్సాప్‌కు ఫొటో పంపించింది. దీంతో ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. స్పందించిన సీఐ వెంకటేశం వెంటనే విషయాన్ని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు సమాచారం అందజేసి, వారి సహకారంతో మౌనిక, ఆమె కొడుకులను సూరారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో పోలీసులకు రమేశ్ ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ ట్రోబాల్ టోర్నీలో తెలంగాణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పాటియాలా(పంజాబ్) వేదికగా ఈ నెల 28 నుంచి మొదలయ్యే 29వ జాతీయ సబ్ జూనియర్ ట్రోబాల్ చాంపియన్‌షిప్‌నకు తెలంగాణ బాలుర, బాలికల జట్లను శనివారం ఎంపిక చేశారు. బాలుర టీమ్ కెప్టెన్‌గా సిద్దార్థ్, బాలికల జట్టుకు రక్షిత నాయకత్వం వహించనుంది. జట్ల ఎంపికతో పాటు ప్లేయర్లకు ప్లేయింగ్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ యాదవ్, ఉపాధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, కిరణ్‌చారి పాల్గొన్నారు.

అన్నమాచార్య జయంత్యుత్సవాలు

కొండాపూర్, మే 25 : అన్నమాచార్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కళాకారులు ఆలపించిన గాత్ర, నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో సాయి కృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో తాళ్ళపాక అన్నమాచార్య ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు, నృత్యాభినయాలతో ఆద్యాంతం అలరించారు. అకాడమీకి చెందిన 90 మంది కళాకారులు తమ గాత్ర, నృత్యాలతో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. ఉత్సవాల్లో టీవీ నటులు పీవీ ప్రదీప్, సరస్వతి, కళాకారి ఆశ్రిత వేముగంటి, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ జ్యోస్య భట్ల తదితరులు హాజరై కళాకారులను అభినందించారు.

సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న కళాకారులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

మాదాపూర్, మే 25: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో శనివారం పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో కళాకారు శ్రీ కృతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ కళాకారులచే నృత్య ప్రదర్శనలను నిర్వహించారు. తొలుత శ్రీవిష్ణు సహస్రనామం, లక్ష్మీఅష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరం, సంకాయ అన్నమ గాయత్రి, శ్రీ మద్దదీయ అన్నమయ్య గురుస్తుతితో ప్రారంభించగా.. శ్రీకృతి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ లలిత రమేశ్, వారి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి శాలువాను కప్పారు. అనంతరం వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాదం వితరణ గావించారు.

కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరిస్తున్న కళాకారులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు

దుండిగల్, మే 25 : ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్)అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్(ఎన్ఎంసీ) పరిధిలోని రాజీవ్‌గృహకల్పకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీలు/బస్తీలకు చెందిన ప్రజలు శనివారం కేఎస్ఆర్ నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ కాలనీలు/బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో రాజీవ్‌గృహకల్ప వాసులు మీసాల వెంకటేశ్, భిక్షపతి, దశరథ్, అరుణ, సావిత్రి, వనజ, సన్ని తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 31వ డివిజన్ పరిధిలోని శివాలయం, నల్లపోచమ్మతల్లి ఆలయ కమిటీ ప్రతినిధులు శనివారం కేఎస్ఆర్‌ను కలిసి ఆలయాభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వరరావు, బాలకృష్ణ, రమణ, రాంచందర్‌నాయరక్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

My client **SMT. ARSHANAPALLY HARSHINI @ KALYANI L,** W/o. Arshanapally Naveen Kumar, D/o. Late Krishna Rao L, R/o. H.No. 5-3-434/1, Plot No. 179, Venkatarao Nagar Colony, Near Community Hall, Vivekanandanagar, Kukatpally, Hyderabad-500 072 name before marriage was **KALYANI L,** D/o. Late Krishna Rao L and after marriage her name was changed as **SMT. ARSHANAPALLY HARSHINI,** W/o. Arshanapally Naveen Kumar and same was reflecting in her id proofs such as Aadhaar card, PAN card and do Here by intimating the same to general public.

Sd/- **G.N. SATYANARAYANA,**
Reg. No. (680/1991),
B.Hari Babu, N.Sudha Rani,
Padma Polirathi, K.Varun Yadav,
Karthik Potnuru, Advocates
Flat No. 101, First Floor,
A.S. Raju Nagar Kaman,
KPHB Main, Kukatpally,
Hyderabad-500 072,
Cell # 9246100703 / 9618117703.